# 'యువగర్జన' విజయవంతానికి అమెరికాలో ప్రవాసుల యాత్ర

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** గుంటూరులో నవంబరు 5న తెదేపా నిర్వహించనున్న 'యువగర్జన' సభకు విస్తృతంగా సన్నాహాలు జరుగుతున్నాయి. కార్యక్రమ విజయవంతానికి ప్రవాస భారత తెదేపా కార్యకర్తలు, అభిమానులు కూడా తమ వంతు ప్రయత్నాలు చురుగ్గా చేస్తున్నారు. సభకు తరలిరావాల్సిందిగా రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వేమన సతీశ్ ప్రవాసాంధ్రులను కోరారు. సభ విజయవంతం చేసే ప్రయత్నాల్లో భాగంగా ఆయన ఆధ్వర్యాన వాషింగ్టన్‌లో చైతన్య రథయాత్ర పేరిట ఓ యాత్ర ప్రారంభమైంది. వాషింగ్టన్‌లో ఆరంభమైన ఈ యాత్ర బాల్‌టిమోర్, ఫిలడెల్ఫియా, డెలవేర్, న్యూజెర్సీ, న్యూయార్క్, కనెక్టికట్, బోస్టన్ మీదుగా నయాగరా జలపాతం వరకు సాగుతుందని ప్రవాస భారత తెదేపా, రాష్ట్ర తెలుగు యువత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. యాత్ర ప్రతి మజిలీలో యువగర్జన కరపత్రాలు, తెదేపా ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వీడియో సీడీలు పంచిపెడతారు.

**అమెరికా నుంచి ప్రత్యేక విమానం:** అమెరికాలోని 150 మంది తెదేపా కార్యకర్తలు ప్రత్యేక విమానంలో ఈ సభకు రానున్నారు. ఈ విషయమై ఖతార్ ఎయిర్‌లైన్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సతీశ్ తెలిపారు.